అగ్గి.. బతుకు బుగ్గి..!

- గతేడాది 18 పరిశ్రమల్లో ప్రమాదాలు
- 10 మంది మృతి.. 50 మందికి గాయాలు
- నిపుణుల పర్యవేక్షణ కరువు
- రసాయనాలపై అవగాహన లేమి
- పరిశ్రమల్లో కొరవడిన రక్షణ చర్యలు

పారిశ్రామికవాడలో కార్మికుల ప్రాణాలకు రక్షణేదీ?

పరిశ్రమల్లో విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇళ్లకు చేరడం గగనంగా మారింది. పలు రసాయన పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు లేవు. నైపుణ్యం, అవగాహన కలిగిన కార్మికులను తీసుకోకపోవడమే అధిక ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది. ఇటీవల కాలంలో ఎక్కువగా రియాక్టర్ల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి ఒత్తిడిని సరైన సమయంలో గుర్తించకపోవడం, కెమికల్ రియాక్షన్‌ను నివారించడంలో విఫలం కావడంతో పేలుళ్లు జరుగుతున్నాయి.


సీఎంహెచ్ పరిశ్రమ వద్ద రియాక్టర్ పేలిన ఘటనలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పటాన్‌చెరు: ఇంటి నుంచి వెళ్లిన కార్మికుడు ఇంటికి క్షేమంగా వస్తాడో రాడోననే ఆందోళన కార్మికుల కుటుంబాల్లో నెలకొంది. రెండు రోజుల క్రితం పాశమైలారం పారిశ్రామికవాడలో రెండు రసాయన పరిశ్రమల్లో ప్రమాదం జరిగి మంటలు వ్యాపించాయి. ఒక కార్మికుడు సజీవ దహనమయ్యాడు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పారిశ్రామికవాడల్లో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతుందనడానికి ఈ ఘటన నిదర్శనం. ఇక పెద్ద ఎత్తున ప్రమాదాలు జరిగితేనే విషయాలు వెలుగులోకి వస్తాయి. లేకుంటే చీకట్లోనే ఉండిపోతాయి. కొందరు పారిశ్రామికవేత్తలు వ్యాపారం అభివృద్ధి, లాభార్జన గురించి ఆలోచిస్తున్నారే తప్ప.. కార్మిక సంక్షేమం, శ్రేయస్సు గురించి అసలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలు కూడా పట్టించుకోవడం లేదు. కనీసం సహాయక చర్యలు తీసుకునేందుకు ఆయా పరిశ్రమ ఆవరణల్లో సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. పాశమైలారం పారిశ్రామికవాడలో 297 పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో కనీసం ఫైరింజన్ తిరిగే పరిస్థితి కనిపించదు. బొల్లారం వంటి పారిశ్రామికవాడలో ఎలాంటి నిబంధనలు లేకుండా నిర్మాణాలు చేశారు. ఒక పరిశ్రమలో ప్రమాదం జరిగితే మిగతావి కూడా అగ్నికి ఆహుతయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

కార్మికుల వెట్టిచాకిరి

జిన్నారం ఉమ్మడి మండల పరిధిలో 450 పరిశ్రమలు ఉన్నాయి. రికార్డుల ప్రకారం నియోజకవర్గ పరిధిలో గతేడాది పంతొమ్మిదింటిలో ప్రమాదాలు జరిగితే 50 మంది గాయపడి అందులో 10 మంది చనిపోయారు. గతేడాది నవంబర్‌లో పాశమైలారం పారిశ్రామికవాడలోని ఆదిత్య ఫార్మాలో పొడి రసాయనాన్ని ద్రవ రూపంలోకి మార్చే క్రమంలో మంటలు ఎగిసిపడ్డాయి. నిపుణుల పర్యవేక్షణ లేకపోవడం,ఇక కార్మికులకు రసాయనాలపై సరైన అవగాహన లేక ప్రమాదం చోటుచేసుకుంది. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో కాంట్రాక్టు కార్మికులను పెట్టి వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. బిహార్, ఒడిశా, జార్ఖండ్ తదితర ఉత్తరాది రాష్ట్రాల నుంచి కార్మికులను ముఠాలుగా తీసుకొచ్చి ఇక్కడ పని చేయిస్తున్నారు. ఏ పరిశ్రమలో ఎంత మంది పని చేస్తున్నారనే వివరాలు ఉండటం లేదు. ప్రమాదంలో జరిగినప్పుడు ఇక్కడ ఎంత మంది పనిచేస్తున్నారు? ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించారా? లేదా? అనే వివరాలు సైతం చెప్పడం లేదు. రెండు రోజుల క్రితం సాల్ బెరీస్ పరిశ్రమలో ప్రమాదం జరిగితే మొత్తం 14 మంది అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అందులో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఒకరు చనిపోయారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు ఏమీ లేవని అధికారులు ప్రాథమికంగా తేల్చారు.

కార్మికులకు అవగాహన కల్పించాలి



ప్రమాదాలు జరగకముందే కార్మికులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రతి నెలా భద్రతా దినాన్ని పాటించి కార్మికులకు అవగాహన కల్పించాలి. ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. దీనిపై ప్రభుత్వ అధికారి పర్యవేక్షణ ఉండాలి. నష్టపరిహారం అందాలి. చట్ట ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలి. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులు తనిఖీలు జరపడం లేదు అందుకే ప్రమాదాలు జరుగుతున్నాయి.

–ఎస్.యాదగిరి యాదవ్, భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

కార్మికుల సంక్షేమం ఎవరికీ పట్టదు



జిల్లాలోని పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికులను పెట్టి పనులు చేయించుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భారీ యంత్రాలు, ప్రమాదకర రసాయనాల ఉత్పత్తి కేంద్రాల్లో పని చేయించుకుంటున్నారు. రక్షణ కవచాలు, మాస్కులు కూడా అందించడం లేదు. ప్రమాదాల్లో గాయపడిన, మృతిచెందిన వారి వివరాలు వెల్లడించడంలేదు. నష్టపరిహారం అనే మాట రావడం లేదు.ఉత్తరాది రాష్ట్రాల నుంచి కనీసం చదవడం, రాయడం రానివారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ఒక్క శాఖ అధికారి కూడా నిబంధనలను పాటించాలని సూచించడం లేదు. తనిఖీలు చేయడం లేదు.

–నాయిని నర్సింహారెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకుడు, పటాన్‌చెరు

సిబ్బంది లేరు

ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. నేనొక్కదాన్నే ఉన్నాను. సిబ్బంది లేరు. పారిశ్రామికవాడల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పాశమైలారం పారిశ్రామికవాడలోని పరిశ్రమలపై త్వరలోనే ఓ నివేదికను రూపొందించనున్నాం.

– శ్రీవిద్య, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్


అన్నపూర్ణాదేవి



వైభవంగా రాజశ్యామల హోమం

రాయదుర్గం: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సూర్యభగవాన్, రాజశ్యామలాదేవి హోమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి బాపూనగర్ సెయింట్ జేవియర్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్‌ను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు దోహదపడతాయన్నారు. స్కూల్ కరస్పాండెంట్ రాజ్యలక్ష్మీ, చైర్‌పర్సన్ జేవీయర్ రాజు, స్థానిక నాయకులు రాజు, యాదయ్య, గోపాల్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


నమూనాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ ఇంటరాక్షన్ డిజైన్ విజేత ‘లూసిడ్’



రాయదుర్గం: ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ ఇంటరాక్షన్ డిజైన్ కేటగిరిలో డిజైన్ చాలెంజ్‌లో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ విజేతగా నిలిచింది.‘లూసిడ్’ అనే శీర్షికతో టోల్‌ఫ్రీ నంబర్‌తో పాటు వినియోగదారులు పునర్వినియోగపరచదగిన ప్లాస్టిక్ వ్యర్థాలను తీయడాన్ని సులభతరం చేసే యాప్ రెండింటిని రూపొందించిన విద్యార్థి బృందం పోటీలో సమర్పించగా వీరు విజేతగా నిలిచారు. డిసోర్స్ మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్, ఐడీసీ స్కూల్ ఆఫ్ డిజైన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–ముంబాయి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజైన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–గౌహతి, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ సంయుక్తంగా అంతర్జాతీయ స్థాయిలో డిజైన్ పోటీని నిర్వహించారు. ఇందులో గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని ఎంటెక్ (ప్రాడక్ట్ డిజైన్, మేనేజ్‌మెంట్) విద్యార్థులు శాంభవిఓజా, అనికేత్ చందేకర్, అనుజ్ మాల్వియా, వియనగోపి, వెంకట్‌సాయి బృందం విజేతగా నిలిచింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, దిగుమతి, నిల్వ, పంపిణీ అమ్మకం, వినియోగంపై నిషేధం విధించడం ద్వారా భారతదేశంలో ఒక నిశ్చయాత్మక అడుగు ముందుకు వేసినా కఠినంగా అమలు చేయలేకపోవడంతో వార్షిక ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిలో కేవలం 30 శాతం మాత్రమే రీసైకిల్ చేయబడుతోందని ఈ బృందం గుర్తించింది. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చివేయడంతో అనేక తీవ్ర అనారోగ్య సమస్యలను ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తోందని విద్యార్థుల బృందం పరిశోధనలో తేల్చింది.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



గచ్చిబౌలి: కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం ధర్నా చేశారు. ఏఐటీయూ అనుబంధ సంస్థ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మిక జీఓ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు రూ.13,600 వేతనం ఇవ్వాలని ఉండగా కేవలం రూ.11వేలు మాత్రమే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అది కూడా మూడు నాలుగు నెలలకోమారు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్ యాదవ్, రాజు,భాగ్య మల్లేశ్వరి, అనిత,లక్ష్మీతో పాటు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని సీనియర్ బీఆర్‌యస్ కార్యకర్త దుర్గేష్ శేరిలింగంపల్లి ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. శుక్రవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ దుర్గేష్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రెహమాన్, గోపాల్, రవి, శిధర్, ఇస్మాయిల్, లింగం, సంగేష్, శ్రీను, బాలు, రవి పాల్గొన్నారు.

బస్తీ దర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో శుక్రవారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ పుష్ప నగేష్ తో పాటు జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో పలువురు మాట్లాడుతూ కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని దానిని పరిష్కరించాలని కోరారు. అదే మాదిరిగా పలుచోట్ల రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేయడం వలన అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు.అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

చెరువులను సందర్శించిన జెడ్‌సీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ శుక్రవారం అధికారులతో కలిసి పలు చెరువులను పరిశీలించారు. కాముని చెరువు నాలా, సఫ్దార్‌నగర్, రాజీవ్ నగర్ నాలా, సున్నం చెరువు, ముళ్లకత్వ చెరువు వెంబడి ఉన్న అంబేద్కర్‌కాలనీ, రాజీవ్ గృహకల్ప ప్రాంతాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలను ఇచ్చారు. నాలాలో ఉన్న అడ్డంకులు వెంటనే తొలగించాలని ఆదేశించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం మ్యాన్‌హోల్, కాచ్‌పిట్‌ల దగ్గర ప్రమాదాలు జరగకుండా చూడాలని, వాటిని తెరవకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పూడికతీత పనులు పూర్తి చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పునరావాస స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. వరద ముంపు ప్రాంతాలలోని పనులు, నీటి నిల్వ ప్రాంతాల్లో మరమ్మతులు, నాలాల నిర్మాణ పనులు పూర్తి చేసి రాబోయే వర్షాకాలం ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రదేశాలను గుర్తించాలని, నాలా చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రదేశాలను గుర్తించి మరిన్ని క్యాచ్ పిట్‌లను ప్రతిపాదించాలన్నారు. రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఫెన్సింగ్ లేని ప్రదేశాల్లో ప్రజలు, చిన్నారులు నాలా దగ్గరకు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

పటాన్‌చెరు తహసీల్దార్‌గా రంగారావు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు తహసీల్దార్‌గా రంగారావు శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు.సూర్యాపేట జిల్లా... చివ్వెంల నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహశీల్దార్ భాస్కర్ నారాయణఖేడ్‌కు బదిలీపై వెళ్లారు.

‘మేనేజ్‌మెంట్ ఆఫ్ వేస్ట్ టైర్’ శిక్షణ శిబిరం


వర్క్ షాపులో పాల్గొన్న పీసీబీ అధికారులు

గచ్చిబౌలి: పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా వాడి పడేసిన వాహనాల టైర్లను రీసైక్లింగ్ చేసే విధానాలపై చర్చ జరిగిందని ఈపీటీఆర్ఐ సైంటిస్ట్ లీలావతి తెలిపారు. గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో ‘మేనేజ్‌మెంట్ ఆఫ్ వేస్ట్ టైర్’ అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణా శిబిరంలో ఆమె ప్రసంగించారు. వాడిన టైర్లను కాల్చడం వల్ల పర్యావరణం కలుషితమవుతుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాత టైర్ల నుంచి ఆయిల్ తయారు చేయవచ్చన్నారు. టైర్ల నుంచి తీసిన ఆయిల్‌ను సిమెంట్ పరిశ్రమలలో వాడొచ్చన్నారు. అలాగే పాత టైర్లను బీటీ రోడ్ల నిర్మాణంలోను వాడే అవకాశాలపై చర్చించామన్నారు. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్రాల కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


రంగనాథస్వామి ఆలయంలో స్వామివారిని పల్లకీపై ఊరేగిస్తున్న అర్చకులు, ఆలయకమిటీ ప్రతినిధులు

రాయదుర్గం: నానక్‌రాంగూడ రంగనాథస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణతో ఉత్సవాలు మొదలయ్యాయి. పూజల అనంతరం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. అలాగే వాహన సేవలు నిర్వహించారు. ఈనెల 23వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రైతాంగ, కార్మిక సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం


జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: రైతాంగ, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం నిర్వహించిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పటాన్‌చెరు జాతీయ రహదారిపై ధర్నా చేసిన అనంతరం ప్రధాని మోదీ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ... గత ఎన్నికల సమయంలో రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారని, ప్రస్తుతం దేశంలో 30 కోట్ల మంది నిరుద్యోగులు నిరాశ్రయులయ్యారని అలాగే చిన్న మధ్య తరహా పరిశ్రమలు మూసివేతతో కోట్లాదిమంది కార్మికులు రోడ్డున పడ్డారని మండిపడ్డారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి, కార్మిక నాయకులు రతన్‌సింగ్ ,అమర్ యాదవ్ ,సామ్రాట్, రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాంబయ్య, కుంచాల కిషన్, పాషా తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మోతీనగర్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి రాజీవ్‌గాంధీనగర్ చౌరస్తాలో సఫ్దార్‌నగర్ సెక్టార్ ఎస్ఐ మాల్యానాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు బహుమతి వచ్చిందని ఫోన్లు చేస్తే స్పందించవద్దని సూచించారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరు తమ తమ ఫోన్‌లలో వచ్చే మెసేజ్‌లను ఒకటికి రెండు సార్లు చదువుకొని అవసరమనుకుంటేనే సమాధానం ఇవ్వాలని లేకపోతే వాటిని డిలీట్ చేయాలని సూచించారు. అదే విధంగా వివిధ రకాల లింక్‌లను పంపి అకౌంట్ నుంచి డబ్బు కాజేసే అవకాశాలు ఉన్నాయని, తెలియని లింక్‌లను ఓపెన్ చేయవద్దని తెలిపారు.

18 నుంచి స్త్రీ వ్యాధుల ఉచిత వైద్యశిబిరం

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని ఆహా క్లీనిక్స్‌లో రేపటి నుంచి స్త్రీ వ్యాధుల ఉచిత వైద్యశిబిరంను ఏర్పాటు చేయనున్నారు. మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్, ఆహా క్లీనిక్స్ ఆధ్వర్యంలో ఈ నెల ఆదివారం 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. టెలికాంనగర్‌లోని ఆహా క్లీనిక్స్‌లో వారం రోజుల పాటు నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. మహిళలు గైనకాలజిస్ట్ కన్సల్టేషన్, పాప్‌స్మియర్ టెస్ట్, ఆర్‌బీఎస్, బీపీ తదితర పరీక్షలు చితంగా చేస్తారు. మహిళలు ఫోన్ నంబర్ 9888977712, 9160884461లలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నేడు డీఎస్‌యూ ‘చలో జన్వాడ’

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని దళిత్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం చలో జన్వాడ చేపట్టారు. జన్వాడలో దళితులపై జరిగిన దాడులకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. గాయపడిన వారికి సానుభూతి తెలుపనున్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు ‘ఐఎస్‌బీ’లో గ్రాడ్యుయేషన్ డే

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో శనివారం సాయంత్రం 4 గంటలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఐఎస్‌బీలోని హంగర్ ఏసీ–6 లాన్స్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పీజీపీఎంఎఫ్‌ఏబీ–సీఓ–2022, పీజీపీప్రో సీఓ–2023, ఏఎంపీబీఏ సీఓ–2023(డబ్ల్యూ), సీఓ–2023(ఎస్)వారికి మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా ముఖ్య వక్తగా పాల్గొంటారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల ప్రసంగిస్తారు.

సంతలు జరిగే ప్రాంతాలు..

హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలో... వారపు సంతలు గంగారంలో బుధవారం, హుడా కాలనీలో గురువారం, ఆర్టీసీ కాలనీలో బుధవారం, మదీనాగూడ గ్రామంలో ఆదివారం, మైత్రినగర్ మంజీరా రోడ్డులో శనివారం, ఆల్విన్ కాలనీలో గురువారం, ఓల్డ్ హఫీజ్ పేట్ గ్రామంలో గురువారం, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద గురువారం, 5వ ఫేజ్ వద్ద బుధవారం కూరగాయల సంత ఉంటుంది.

మాదాపూర్ డివిజన్ పరిధిలో..

మాతృశ్రీనగర్‌లో సోమవారం, గోకుల్ ప్లాట్స్‌లో పెద్ద చర్చి వద్ద ఆదివారం, 80 ఫీట్ల రోడ్డులో బుధవారం సంతలు జరుగుతాయి.

పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐగా పరమేశ్వర్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐగా పరమేశ్వర్‌గౌడ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.నాగర్ కర్నూల్ జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో సీఐగా విధులు నిర్వహించిన ఈయన బదిలీపై వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహించిన సీతారామిరెడ్డి బదిలీపై ఇబ్రహీంపట్నం వెళ్లారు. బాధ్యతలు తీసుకున్న పరమేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో బెల్ట్‌షాపులు, గంజాయి విక్రయాలపై తమకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అదేవిధంగా వైన్‌షాపుల వద్ద బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆటోడ్రైవర్ల నిరసన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో శుక్రవారం ఆటోడ్రైవర్‌లు నిరసన తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకంతో తమకు ఉపాధి కరువైందని, ప్రభుత్వం నెలకు రూ.15వేల జీవనభృతి ఇవ్వాలని కోరారు. ఆటో డ్రైవర్‌ల సంఘం నాయకులు వెంకటేశ్, రాజు, మల్లేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే మహిళా సాధికారత

- జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి

పటాన్‌చెరు టౌన్: విద్య ద్వారానే మహిళా సాధికారత సాధ్యమని కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి అభిప్రాయపడ్డారు. శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మలబార్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో మెరిట్ స్కాలర్‌షిప్ నగదును 232 మంది విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి దీపక్‌కుమార్ మాట్లాడుతూ..మహిళల ఆర్థిక స్వతంత్రం వారి విద్యార్హత మీదనే ఆధారపడుతుందన్నారు. కార్యక్రమంలో రాధిక, పద్మజ, డాక్టర్ యోగిబాబు, సురేష్, శ్రీనివాసరావు, డాక్టర్ బగ్గు,రవీందర్, వీరేందర్, సరిత, అశ్వినిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం

- రూ.41 లక్షలు పోగొట్టుకున్న బ్యాటరీల వ్యాపారి

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ ట్రేడింగ్ అంటూ సైబర్ వలలో పడ్డ ఓ వ్యాపారి రూ.41 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గౌతంనగర్ కాలనీకి చెందిన ఓ బ్యాటరీల వ్యాపారి జనవరి 6 తేదీన ఫేస్‌బుక్ చూస్తుండగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించిన లింక్ కనిపించింది. దీంతో ఆ లింక్ ని క్లిక్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో అపరిచిత వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించిన యాప్ ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. వ్యాపారి నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేస్తు వచ్చాడు. నగదుతో పాటు, కమిషన్ చూపిస్తుండడంతో బాధితుడు పలు దఫాలుగా రూ.41 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. తాను పెట్టిన నగదుతో పాటు రెట్టింపైన నగదు రూ.94 లక్షలు ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీ,బిడ్డ అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భర్త వేధింపులు భరించలేక ఓ గృహిణి నాలుగేళ్ల కూతురుతో కలిసి అదృశ్యమైన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం జరిగింది.కొల్లూర్ పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్‌కు చెందిన జయంత్ బిశ్వాస్ భార్య కవితా బిశ్వాస్, నాలుగేళ్ల కూతురు అంకితతో కలిసి గత ఆరు నెలల క్రితం తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ లేబర్ క్యాంప్‌లో నివాసం ఉంటున్నారు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.కాగా జయంత్ బిశ్వాస్ నిత్యం మద్యం తాగి వచ్చి భార్య కవిత ను కొట్టేవాడు. వేధింపులు రోజురోజుకు ఎక్కువ కావడంతో కవిత కూతురు అంకితను తీసుకొని ఈనెల 14వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో చుట్టుపక్కల వెతికినా వారి ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.